క్లుప్తంగా

అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించండి



పిల్లలకు ఇంట్లో పాఠాలు బోధిస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్ అనంతాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవటంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు, సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 23 మంది పిల్లలు, 18 గర్భిణులు ఉన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త గత పదేళ్ల తన సొంత ఇంట్లోనే కేంద్రాన్ని నిర్వహిస్తోంది. భవనం లేకపోవడంతో వర్షం పడితే అవస్థలు పడుతున్నారు.పౌష్టికాహారాన్ని భద్రపరుచుకోలేక ఇబ్బంది పడుతున్నారు. భవనాన్ని నిర్మించాలని పలు సార్లు అధికారులను కోరినా పట్టించు కోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలేరమ్మ ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరులోని పోలేరమ్మ దేవాయలంలో గ్రామదేవత పోలేరమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ దేవత విగ్రహానికి అభిషేకాలు చేసి, దేవాలయానికి పైభాగంలో శిఖరాలకు పూజలు చేశారు. ప్రత్యేక హోమాలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి, ప్రసాదాలను పంపిణీ చేశారు. గ్రామంలో పోలేరమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

విజేతలకు జ్ఞాపికల ప్రదానం



జ్ఞాపికలు అందుకున్న విజేతలు

ఏర్పేడు: మండలంలోని కొత్తకాల్వ గ్రామంలో ఉన్న కృషి బ్యాడ్మింటన్ అకాడమీలో విజేతలకు ఆదివారం జ్ఞాపికలను ప్రదానం చేశారు. తిరుపతి, ఏర్పేడు, రేణిగుంట మండలాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. జూనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా తిరుపతి వేద బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన మోక్షిత్, హరి విజయం సాధించారు. మునగలపాళెంకు చెందిన బాలాజీ, లోకేష్ రన్నర్స్‌గా నిలిచారు. సీనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా తిరుపతి వేద బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన శివ, పూర్ణచంద్ర, రన్నర్స్‌గా గాజులమండ్యంకు చెందిన లోకేష్, మధు నిలిచారు.

హస్త కళలను ఆదరించాలి

తిరుపతి కల్చరల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం పట్టే హస్తకళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖాదీ కాలనీలోని శివశక్తి కల్యాణ మండపంలో ఆదివారం చేనేత జౌళి మంత్రిత్వ శాఖ సౌజన్యంతో చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. స్టాల్స్‌ను పరిశీలించి కళారూపాల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ఎనలేని గౌరవం లభిస్తోందన్నారు. మన సంస్కృతిని పరిరక్షిస్తున్న కళాకారులు అభినందనీయులన్నారు. హస్త కళాకారులను ఒకే వేదికపైకి తెచ్చి కళారూపాల విక్రయాలతో ఆదరిస్తున్న నిర్వాహకులు దశరథాచారిని అభినందించారు. హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.దశరథాచారి మాట్లాడుతూ ప్రదర్శన మార్చి 6వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో 200 మంది కళాకారులు తయారు చేసిన వివిధ రకాల కొయ్య బొమ్మలు, చేనేత వస్త్రాలు, గృహోపకరణాలు ఉన్నాయని తెలిపారు. ఎస్వీయూ పాలక మండలి సభ్యుడు మల్లారపు మధు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత బండ్ల లక్ష్మీపతి, మంగళంపేట సురేష్, హరిచౌహాన్ నాయక్, నాగేంద్ర పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని ఆలయంలో శాంతి హోమంలో పాల్గొన్న ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, భక్తులు, ఉత్సవమూర్తులకు అభిషేకం







తొండమాన్‌పురం: చంద్రప్రభపై వెంకన్న విహారం



స్వామి అమ్మవార్ల ఊంజల్ సేవ

సూర్య, చంద్రప్రభలపై సర్వాంతర్యామి

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి. భక్తజన సంకీర్తనలు, కోలాటాలు, బాజాభజంత్రీలతో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది. అందులో భాగంగా ఆదివారం ఉదయం బద్రీనారాయణుడి అవతారంలో స్వామివారు సూర్యప్రభ వాహనంపై దివ్య తేజోయముడై భక్తులను కటాక్షించారు. అంతకు ముందు తెల్లవారు జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, శాత్తుమొర, మొదటి గంట, బలి కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి స్వామివారికి ఫల, పుష్ప, సుగంధ, పన్నీటి ద్రవ్యాలతో అభిషేక సేవతోపాటు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని అలంకార మండపంలో బద్రీనారాయణుడిగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై కొలువు దీర్చి ఊరేగించారు. రాత్రి 8.30 గంటలకు శ్రీనివాసుడు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ చల్లని కాంతులతో భక్తులను ఆశీర్వదించారు. భక్తుల కోలాటాలు, చెక్క భజనలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు సాగింది. గోవింద నామస్మరణలతో తొండమాన్‌పురం మార్మోగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

వేడుకగా శాంతి అభిషేకం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత ఉత్సవమూర్తులకు ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాంతి అభిషేకాలు నిర్వహించారు. ప్రతిరోజు రెండు సార్లు ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆ సందర్భంగా ఉత్సవాల దోషాల నివారణకు పూజారులు అలంకార మండపంలో శాంతి అభిషేకాలను నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, గంధం, పన్నీరులతో అభిషేకం చేశారు. ఆ తర్వాత అలంకరణ చేసి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కె.వి.సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ఆలయాధికారులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఎమ్మెల్యే కిలివేటి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

రేణిగుంట: మండల కేంద్రానికి చెందిన ముస్లిం నూతన వధూవరులను తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఆశీర్వదించారు. రేణిగుంటలోని షాదీమహల్‌కు చేరుకున్న ఎంపీ, ఎమ్మెల్యే స్థానిక బుద్ధవీధికి చెందిన హయత్ కుమార్తె రజియా, ఇమ్రాన్ జంటను ఆశీర్వదించి వారికి బీరువా, డబుల్‌కాట్, పరుపును బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, మండల కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, అబ్దుల్‌ఖదీర్, మెస్ బాబు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై కళాజాత

ఏర్పేడు: మండలంలోని కందాడు, పాపానాయుడుపేట, మడిబాక, ముసలిపేడు గ్రామాల్లో నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ఆదివారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నట్లు కళాజాత బృందం సభ్యులు వివరించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అమలు చేస్తున్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, మధ్యాహ్న భోజన మెనూ, పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, బెల్టు, షూ, బ్యాగులు తదితర వసతులపై పాటల రూపంలో గ్రామస్తులకు వివరించారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కో–ఆర్డినేటర్ సుభాష్, ప్రతినిధులు కోటేశ్వరి, రాజేశ్వరి, సురేష్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.



మౌలిక వసతులపై వివరిస్తున్న కళాజాత బృందం

వైజ్ఞానిక ప్రదర్శన నేడు

వెంకటగిరి: జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్‌వీఎం ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనను ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని స్థానికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

చెంగాళమ్మ సేవలో ద్వారకా తిరుమల ఈఓ

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ జాయింట్ కమిషనర్, ఈఓ వి.త్రినాథరావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారు ఆలయానికి విచ్చేయగానే ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఘనంగా స్వాగతం పలికి సాదరంగా ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం అమ్మవారి వద్ద వారికి పూజలు చేయించి వేదపండితుల ఆశీర్వచనాలతో ఆలయ మర్యాదలతో వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జాతరపై సమీక్ష



చిల్లకూరు: మార్చి14 నుంచి నాలుగు రోజు పాటు తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో జరిగే జాతరకు సంబంధించి సమీక్ష ఈనెల 28న మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. తూర్పుకనుపూరు దేవస్థానంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే జాతర సమీక్షకు మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు..

ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వెండి చీరతో అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం ప్రధానోపాధ్యాయుడు సంజీవయ్య ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్రకు వెళ్లారు. పాఠశాలలోని 30 మంది విద్యార్థులు తిరుపతి జూపార్క్, సైన్స్ సెంటర్, కపిలతీర్థం, చంద్రగిరి కోట తదితర ప్రాంతాలకు వెళ్లి తిరిగి రాత్రికి స్వగ్రామానికి చేరుకోనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు దుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.



విజ్ఞాన యాత్రకు వెళుతున్న విద్యార్థులు

కాలుష్యం నుంచి కాపాడండి



క్వారీల వద్ద నిరసన తెలుపుతున్న సిద్ధాపురం గ్రామస్తులు

వరదయ్యపాళెం: క్వారీల నుంచి వెలువడే దుమ్ము, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాల నుంచి కాపాడాలని కోరుతూ మండలంలోని సిద్ధాపురం గ్రామస్తులు ఆందోళనకు చేశారు. సిద్ధాపురం సమీపంలో ఏర్పాటైన శ్రీలక్ష్మీనరసింహ క్వారీ నుంచి రాత్రివేళల్లో అధికంగా దుమ్ము వస్తుండంతో అటు పంటల సాగు, ఇటు ప్రజా జీవనం ప్రశ్నార్థకమవుతోందని, అలాగే సమీపంలోని సెవెన్ హిల్స్ క్వారీ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాల కారణంగా తమ గ్రామంలో తాగునీటి అవసరాలకు వినియోగించే మంచినీటి బావి నీరు కలుషితమవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆదివారం శ్రీలక్ష్మీనరసింహ, సెవెన్ హిల్స్ క్వారీల వద్ద సిద్ధాపురం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేసి, కంకర క్వారీలను నిలిపివేశారు. దుమ్ము వెదజల్లకుండా పటిష్టమైన చర్యలు చేపడితేనే క్వారీలు నడుపుకోవాలని నినాదాలు చేశారు. దుమ్ము, వ్యర్థ జలాలతో అటు పచ్చని పంటలు, ఇటు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని వారు వాపోయారు. క్వారీల సిబ్బంది ఈ సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

రచయిత యువశ్రీకి సాహితీ సత్కారం



యువశ్రీమురళిని సత్కరిస్తున్న ఐఏఎస్ అధికారి నక్కల ప్రభాకర్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో తెలుగు పండిట్ పనిచేస్తున్న రచయిత యువశ్రీ మురళిని సాహితీ సత్కారంతో సత్కరించారు. తిరుపతిలో విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయ అవధాని ఆముదాల మురళి శతావధానంలో దత్తపది, వర్ణన అంశాలపై పృచ్ఛకులుగా యువశ్రీ మురళి వ్యవహరించారు. ఇందుకు గాను యువ శ్రీమురళిని శతావధాన సంచాలకులు ఆచార్య గార్లపాటి దామోదర్‌నాయుడు, ఐఏఎస్ అధికారి నక్కల ప్రభాకర్‌రెడ్డి, సాకం నాగరాజులు సాహితీ సత్కారంతో సత్కరించారు.

అమర ఆస్పత్రి వార్షికోత్సవం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర ఆస్పత్రి 2వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గొరినేని, ఎండీ డాక్టర్ రమాదేవి గొరినేని అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడిన వైద్యులు ఇక్కడకు వచ్చి ఆస్పత్రిని నెలకొల్పి ఈ ప్రాంతవాసులకు నాణ్యమైన వైద్యసేవలను అందించే లక్ష్యంతో పనిచేస్తుండడం సంతోషకరమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన ఆస్పత్రి సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆస్పత్రి సీఈవో వేణుగోపాల్, అడ్మిన్ శ్రీధర్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి జ్ఞాపికలు అందిస్తున్న ఆస్పత్రి యాజమాన్యం

గ్రామాల్లో ఆటలమ్మ అలజడి

- ముందు జాగ్రత్తలు తప్పనిసరి
- వేసవి ప్రారంభంలో అంటువ్యాధుల తాకిడి



చికెన్‌పాక్స్ సోకిన బాలుడు

బంగారుపాళెం: మండలంలోని కొన్ని గ్రామాల్లో ఆటలమ్మ క్రమంగా విజృంభిస్తోంది. వేసవి కాలం ప్రారంభమైతే చాలు చికెన్‌పాక్స్ (ఆటలమ్మ), గవదబిళ్లల సమస్య పిల్లల్లో కనిపిస్తుంది. మార్చిలోకి అడుగుపెట్టకముందే ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఇప్పటికే గ్రామాల్లో చికెన్‌పాక్స్, గవదబిళ్లల సమస్య కనిపిస్తోంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధులు సోకే అవకాశం ఉన్నా ప్రధానంగా చిన్నపిల్లలకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్తలతోనే అంటువ్యాధుల బారినపడకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి వస్తుందన్నారు. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటిపొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచనల మేరకు యాంటీవైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకిన వారిని మిగతావారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు ఇవ్వడమే మంచిది. గవదబిళ్లలు వచ్చినవారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవపదార్థాలనే ఇవ్వాలి. చికెన్‌ఫాక్స్, గవదబిళ్లలు వచ్చినవారి విషయంలో ప్రజల అపోహలు, మూఢనమ్మకాలతో వైద్యం చేసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.


వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవదబిళ్లలు వంటి అంటువ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్నపిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాలి. – **డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్, వైద్యాధికారి, పీహెచ్‌సీ.**

గంగ నీరు వృథా

బీడుభూముల్లో గంగనీరు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గంగనీరు వృథా అవుతోంది. బీడు పొలాల్లో, కాలువల్లో, గుంతల్లో, కాళంగినదిలో గంగనీరు వృథా ప్రవహిస్తోంది. పది రోజుల క్రితం మెట్ట భూముల్లో సాగు చేస్తున్న పంటలకు నీరు లేక ఎండిపోతాయని రైతులు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రజాప్రతినిధులు తెలుగుగంగ అధికారులతో చర్చించి, గంగనీటిని విడుదల చేయించారు. పంటలకు నీటి అవసరం తీరిపోవడంతో ఎక్కడ చూసిన గంగనీరు వృథాగా ప్రవహిస్తోంది. గంగ నీటిని వృథా చేయవద్దని అధికారులు కోరినా పట్టించుకోవటం లేదు. పంట అవసరాలకు మించి నీటిని విడుదల చేయడంతో బీడు భూముల్లో వృథాగా ప్రవహిస్తోంది. గంగనీటిని వృథా కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.